



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు శివారులో ఏర్పాటు చేసిన బీజేపీ విజయ సంకల్ప సభకు హాజరైన కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



భారీగా జనసమీకరణ

మోదీ సభ సక్సెస్ కావడంతో బీజేపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. సభకు మెదక్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. సభా ప్రాంగణంలో మూడు భారీ టెంట్లు వేసి డిజిటల్ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘునందన్‌రావు, నందీశ్వర్‌గౌడ్, యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రెండ్రోజుల క్రితమే బీజేపీలో చేరి జహీరాబాద్ టికెట్ సాధించిన ఎంపీ బీబీపాటిల్ ప్రధాని పక్కనే కూర్చుని ఆయనతో ముచ్చటించడం గమనార్హం. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేని బీజేపీకి నరేంద్రమోదీ సభతో ఎంపీ ఎన్నికల్లో సానుకూలత వస్తుందని నాయకులు చర్చించుకున్నారు.

- బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపిన పర్యటన
- మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ల నుంచి భారీగా జనాలు
- అభిమానుల పూల వర్షం.. ఆకట్టుకున్న ప్రధాని ప్రసంగం

విజయ సంకల్పం

తెలుగులో మోదీ ప్రసంగం ప్రారంభం

పటాన్‌చెరు, మార్చి 5: ప్రధాని నరేంద్రమోదీ విజయసంకల్ప సభ బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు శివారులోని పటేల్‌గూడలో పరిధిలో ఏర్పాటు చేసిన బహిరంగసభకు ఆయన హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అభిమానులను, కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ 'నా తెలంగాణా ప్రజలారా..' అంటూ ఆయన తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. సుదీర్ఘంగా సాగిన ప్రసంగంలో ప్రధాని అనేక అంశాలను ప్రస్తావించారు. కుటుంబ పార్టీలతో దేశం వెనకంజ వేస్తున్నదని పేర్కొనడం ద్వారా బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను విమర్శించారు. తనకు కుటుంబం లేదని ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలను 'మేరా భారత్.. మేరా పరివార్..' అంటూ తిప్పికొట్టారు. స్వార్థం లేకుండా జీవితం మొత్తం దేశానికే అంకితం చేశానని పేర్కొన్నప్పుడు కార్యకర్తలు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. మోదీ అంటే నమ్మకమని.. భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన చెప్పినపుడు మోదీ.. మోదీ.. నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. ప్రధాని తన ప్రసంగాన్ని వందేమాతరం అంటూ ముగించారు.



బీజేపీ సభలో నృత్యం చేస్తున్న కార్యకర్తలు



ప్రధానికి స్వాగతం పలుకుతున్న జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్

ఘన స్వాగతం..

సభా వేదిక వద్దకు ప్రధాని మోదీ హెలీకాప్టర్‌లో గవర్నర్ తమిళిసైతో కలిసి ఉదయం 11:30కు చేరుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండాసురేఖ, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి తదితరులు ప్రధానికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రూ. 6,800 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మౌలాలీ నుంచి లింగంపల్లి వరకు నడవనున్న ఎంఎంటీఎస్ రైలుకు జెండాఊపి ప్రారంభించారు. మామిడిపల్లి జంక్షన్ నుంచి రాంసాన్‌పల్లి వరకు నిర్మించిన 161వ హైవేను జాతికి అంకితం చేశారు. సంగారెడ్డి చౌరస్తా నుంచి మదీనాగూడ వరకు ఆరు వరుసల రోడ్డు, మెదక్ నుంచి ఎల్లారెడ్డి వరకు హైవే నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. అధికారిక కార్యక్రమాల అనంతరం గవర్నర్, రాష్ట్ర మంత్రులు వెళ్లిపోగా.. మోదీ ఊరేగింపుగా విజయసంకల్పసభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఆయనపై కార్యకర్తలు, అభిమానులు పూలవర్షం కురిపించారు. సభకు హాజరైన వారికి చిరునవ్వుతో అభివాదం చేస్తూ ఆయన వేదిక వద్దకు చేరుకున్నారు. 12 గంటలకు ప్రధాని ప్రసంగం ప్రారంభమైంది.

మోదీ ప్రభంజనాన్ని తట్టుకోలేరు

- అవినీతి, కుటుంబ పార్టీలు ఇంటికే పరిమితం
- విజయ సంకల్ప సభలో బీజేపీ నాయకులు

పటాన్‌చెరు, మార్చి 5 : లోక్‌సభ ఎన్నికలతో రాష్ట్రంలో బీజేపీ జైత్రయాత్ర ప్రారంభమవుతుందని.. నరేంద్రమోదీ ప్రభంజనాన్ని తట్టుకోవడం ఎవరికీ సాధ్యం కాదని పటాన్‌చెరు సభలో బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పలువురు రాష్ట్ర నాయకులు విజయసంకల్ప సభలో ప్రసంగించారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ గత పదేళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అగ్ర రాజ్యాల సరసన చేరిందని కొనియాడారు. మౌలిక వసతులు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేయడంతో ఉపాధి అవకాశాలు పెరిగాయని అన్నారు. దేశంలో గత పదేళ్ల సుపరిపాలన చూసిన ప్రజలు బీజేపీకే మరోసారి మద్దతు తెలుపుతున్నారని తెలిపారు. అనంతరం సభకు అధ్యక్షత వహించిన దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.రఘునంధన్‌రావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా అవినీతి, కుటుంబ పార్టీ అయిన బీఆర్‌ఎస్‌కు, కేసీఆర్ కుటుంబ సభ్యులకు అహం తగ్గలేదని, వారి మాటల్లో మాత్రం మార్పు రాలేదని విమర్శించారు. కేంద్రం నుంచి ఒక్క పైసా రాలేదని దుష్ప్రచారం చేసినవారికి నేడు ప్రారంభిస్తున్న అభివృద్ధి పనులే సమాధానమని స్పష్టం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రైల్వేలైన్ నిర్మిస్తామని 40 ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ ప్రకటిస్తే.. మూడేళ్లలోనే దానిని నిజం చేసిన ఘనత మోదీకి దక్కిందని కొనియాడారు. రైలు తెచ్చామని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ఓట్లు దండుకున్నారని విమర్శించారు. ఆ పార్టీలు ప్రజల విశ్వసనీయత కోల్పోయాయని, వారికి ఓట్లు వేస్తే మోరీలో వేసినట్లేనని ఎద్దేవా చేశారు. జహీరాబాద్, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థులు బీబీ పాటిల్, ఈటల రాజేందర్ మాట్లాడుతూ మోదీ నేతృత్వంలో దేశం పురోగమిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో గత పదేళ్లుగా అరాచక కుటుంబ పాలన సాగిందని, ప్రజల సొమ్మును పెద్దఎత్తున దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అన్నీ తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో కొద్దిరోజుల్లోనే పాలన అస్తవ్యస్తంగా మారిందని, చాపకింద నీరులా అవినీతికి తెరతీస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కేంద్రం నుంచి రికార్డు స్థాయిలో నిధులు వచ్చినా.. పైసా ఇవ్వలేదని బీఆర్‌ఎస్ చేసిన దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదని పేర్కొన్నారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్లు మంజూరు చేస్తే.. కేంద్రం పథకాలకు పేర్లు మార్చి అమలుచేసి గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో చేసిన హామీలను నెరవేర్చకపోతే కాంగ్రెస్ త్వరలోనే ప్రజల తిరుగుబాటును ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసిన బీజేపీ గెలుపును అడ్డుకోలేరని పేర్కొన్నారు.



బీజేపీ విజయ సంకల్ప సభకు హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ నేతలు

వెల్‌నెస్‌లో టైంపాస్



- ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు అందని సేవలు
- సంతకాలు చేసి బయటకు వెళ్తున్న సిబ్బంది
- ఖాళీ సమయాల్లో సెల్‌ఫోన్‌లో ఆటలు, సినిమాలు
- దర్జాగా టేబుళ్లపై కాళ్లు పెట్టి మొబైల్‌లో ఆటలు
- సిద్దిపేట వెల్‌నెస్ సెంటర్‌లో గాడితప్పిన వ్యవస్థ

సిద్దిపేట టౌన్, మార్చి 5 : ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లు, వర్కింగ్ జర్నలిస్టుల కోసం గత బీఆర్‌ఎస్ పాలనలో సిద్దిపేటలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది పనితీరు వల్ల అభాసుపాలవుతున్నది. వైద్యం కోసం వస్తున్న వారికి సకాలంలో వైద్యం అందడం లేదని ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులు వాపోతున్నారు. వైద్యం కోసం వచ్చిన వారిని సిబ్బంది పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెల్‌నెస్ సెంటర్‌లో సరిపడా సిబ్బంది ఉన్నప్పటికీ విధుల సమయాల్లో కేంద్రంలో కనపడడం లేదు. ఉన్నవారు కాస్త టైంపాస్ చేస్తుండడంతో వెల్‌నెస్ సెంటర్‌లో వైద్యం కోసం వెళ్లాలంటేనే ఆసక్తిచూపడం లేదు.

బీపీ చెక్ చేసే వారుండరు..

సిద్దిపేటలోని వెల్‌నెస్ సెంటర్‌లో ఉదయం 9.30 గంటల సమయంలో వైద్యులు, సిబ్బంది రిజిస్టర్‌లో సంతకాలు చేసి కొందరు బయటకు వెళ్లిపోతున్నారు. అలా వెళ్లిన వారిలో కొందరు 11 గంటల వరకు తిరిగి వెల్‌నెస్ కేంద్రానికి వస్తున్నారు. కొందరు తిరిగి అసలుకే రాకపోగా, మరికొందరు మధ్యాహ్నం వరకు ఉండి ఇంటికి వెళ్తున్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో వారంలో శని, ఆదివారం మాత్రమే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులు వస్తున్నారు. ఉదయం సమయంలో కొంతమంది మాత్రమే పలు రోగాలకు సంబంధించిన చికిత్స కోసం వస్తున్నారు. అలా వస్తున్న వారికి బీపీ చెకప్ చేసేందుకు కనీసం నర్సులు కూడా అందుబాటులో లేకపోవడంతో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సినిమాలు చూస్తూ కాలక్షేపం

సిద్దిపేట జిల్లా నుంచి వైద్యం కోసం వచ్చే ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు సకాలంలో సేవలను అందించాల్సిన కొంతమంది సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రోగులను పట్టించుకోవడం లేదు. వెల్‌నెస్ సెంటర్‌లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న కొందరు సిబ్బంది డెస్క్‌లపై కాళ్లు పెట్టి సెంటర్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్‌లలో సినిమాలు చూస్తున్నారు. మరికొందరు మొబైల్‌లో ఆటలు ఆడుతూ కాలక్షేపం చేస్తున్నారు. వైద్యం కోసం వచ్చిన రోగులు వీరు చేస్తున్న వింత పోకడలను చూస్తూ మండిపడుతున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

వెల్‌నెస్ సెంటర్‌లో సిబ్బందిపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులు డిమాండ్ చేస్తున్నారు. దాంతో పాటుగా రోగానికి సంబంధించిన పలు రకాల మందులు ఉండటం లేదని, వెంటనే అన్నిరకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి మెరుగైన వైద్యసేవలందించేలా చూడాలని కోరుతున్నారు.



సిద్దిపేట వెల్‌నెస్ సెంటర్‌లో డ్యూటీ సమయంలో సినిమాలు చూస్తూ, సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ కాలక్షేపం చేస్తున్న ఉద్యోగులు

తమ్ముడిని గొడ్డలితో నరికి చంపిన అన్న 7లో
- పొలం గట్టుపై చెట్ల కోసం తగాదా
- సిద్దిపేట జిల్లా విజయపల్లిలో ఘోరం

రైతువేదికల్లో 'వీడియో కాన్ఫరెన్స్'

- మెదక్ జిల్లాలో మూడుచోట్ల ఏర్పాట్లు
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

నర్సాపూర్, మార్చి 5: రైతులకు అధునాతన పద్ధతులు ఎప్పటికప్పుడు అనుభవజ్ఞులతో పాటు శాస్త్రవేత్తల ద్వారా వివరించేందుకు రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న హైదరాబాద్ నుంచి వర్చువల్‌లో మొదటగా మెదక్ జిల్లాలో నర్సాపూర్, కొల్చారం, రామాయంపేటలోని రైతువేదికల్లో ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఆయా కేంద్రాలకు వీడియో కాన్ఫరెన్స్‌కు అవసరమైన టీవీతో పాటు ఇతర పరికరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సీఎం ప్రారంభించే సమయంలో ఆయా కేంద్రాల్లో వ్యవసాయ అధికారులు, స్థానిక నాయకులతో పాటు రైతులు కూడా పాల్గొని ఈ కార్యక్రమాన్ని తిలకించనున్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడీఏ సంధ్యారాణి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రైతులకు అధునాతన వ్యవసాయ పద్ధతులతో పాటు శాస్త్రవేత్తలు కొత్త కొత్త పరిశోధనల ద్వారా వచ్చిన వాటిని ఎప్పటికప్పుడు ఎక్కువమంది రైతులకు తక్షణమే అందాలనే ఉద్దేశంతో ఈ వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదన్నారు. అధునాతన పద్ధతులతో పాటు ఎక్కడైనా రైతులు ఆదర్శంగా పంటలు పండిస్తే వారి అనుభవాలను క్షేత్రస్థాయి నుంచి ఇతర రైతులకు ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించే అవకాశం ఉంటుందని చెప్పారు. వ్యవసాయశాఖ ఎప్పటికప్పుడు కిందిస్థాయి సిబ్బంది ద్వారా రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా కృషి చేస్తుందని తెలిపారు. రైతుల కోసం ప్రత్యేకంగా రైతువేదికల్లో ఏర్పాటు చేస్తున్న వీడియో కాన్ఫరెన్స్ పద్ధతులు ఏ మేరకు సఫలం అవుతాయో చూడాలి.



నర్సాపూర్ రైతువేదికలో ఏర్పాట్లు చేస్తున్న ఏడీఏ, ఏవో

సంగారెడ్డిలో ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

సంగారెడ్డి అర్బన్, మార్చి 5: ఇంటర్మీడియట్ మూల్యాంకనం ప్రారంభమైంది. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు మంగళవారం సంస్కృతం పేపర్-1, 2 సమాధాన పత్రాల మూల్యాంకనం నిర్వహించారు. స్పాట్ వాల్యుయేషన్ క్యాంపు అధికారిగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ వ్యవహరించనున్నారు. ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం తొలిసారి సంగారెడ్డిలో ఏర్పాటు చేస్తున్న సందర్భంగా అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కేంద్రం వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. అవకతవకలు జరగకుండా సీసీ కెమెరాలు బిగించారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు స్పాట్ వాల్యుయేషన్ క్యాంపునకు నియమించిన అధ్యాపకులు విధిగా విధుల్లో చేరాల్సి ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పక్కాగా మూల్యాంకనం చేపట్టాలని అధ్యాపకులకు సూచించినట్టు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ తెలిపారు. లేదంటే జరిమానా రూపంలో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కలెక్టర్ రాజర్షిషాకు ఆత్మీయ వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషాను సన్మానిస్తున్న జిల్లా అధికార యంత్రాంగం

మెదక్ అర్బన్, మార్చి 5: మెదక్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న కలెక్టర్ రాజర్షిషాకు జిల్లా అధికార యంత్రాంగం ఆత్మీయ వీడ్కోలు పలికింది. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన వీడ్కోలు సభలో మాట్లాడిన పలువురు అధికారులు కలెక్టర్ సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా అధికారులు ఘనంగా సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పని చేసిన అనుభవాలను ఎప్పటి మరచిపోలేనన్నారు. విధి నిర్వహణలో పారదర్శకతలే ప్రధానమని ఆయన సూచించారు. అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్ మాట్లాడుతూ రాజర్షిషా అందించిన స్ఫూర్తితో సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కేతకీ ఆలయంలో బ్రహ్మోత్సవాల ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు, ఉద్యోగులు

కేతకీ సంగమేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ఝరాసంగం, మార్చి 5 : సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించే ఉత్సవాల్లో తొలిరోజు మంగళవారం శిఖరపూజ, ధ్వజారోహణం నిర్వహించారు. స్వామివారికి ఆలయ అర్చకులు రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన జరిపించారు. ఆలయానికి కొద్ది దూరంలో ఉన్న పురాతనమైన పుట్టకు పూజలు చేశారు. అనంతరం శిఖరపూజ, ధ్వజారోహణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శశిదర్, మాజీ ఆలయ చైర్మన్ వెంకటేశం గుప్తా, గ్రామస్థులు రుద్రప్పపాటిల్, గాలప్ప పాటిల్, సంతోష్ కుమార్, రుద్రయ్యస్వామి, ఆలయ సిబ్బంది శివ కుమార్‌స్వామి, వీరన్న, అర్చకులు పాల్గొన్నారు.

చెట్లు కాలుతున్నా.. పట్టించుకోరా?

కోహీర్, మార్చి 5: ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేసి ప్రధాన రహదారుల వెంబడి మొక్కలు నాటించినప్పటికీ, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఫలితం లేకుండాపోతున్నది. మండలంలోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న చెట్లు కాలిపోతున్నాయి. కోహీర్ మండలంలోని 65వ జాతీయ రహదారి పక్కన ఉన్న చెట్లు నిత్యం ఏదో ఒకచోట నిప్పంటుకొని కాలిపోతున్నాయి. అయినప్పటికీ అధికారులు ఎవరూ స్పందించడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. దాదాపు ఐదేళ్ల క్రితం హరితహారం కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారికి ఇరువైపులా గుంతలు తవ్వించి మొక్కలు నాటారు. అనంతరం వాటిని పెంచి పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యతను హెచ్ఎండీఏ వారికి అప్పగించారు. వాటికి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి పెంచారు. నాటిన మొక్కలు ప్రస్తుతం చెట్లుగా ఎదిగాయి. అయితే రోడ్డు పక్కన చెట్ల మధ్యలో ఏపుగా పెరిగిన గడ్డికి నిప్పంటుకుని పెంచిన చెట్లు కాలి బూడిదవుతున్నాయి. ఈ విషయమై సంబంధిత అధికారులకు సమాచారమిచ్చినా పట్టించుకోకపోవడంతో నాటిన చెట్లన్నీ బుగ్గి అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారుల కిరువైపులా ఉన్న మొక్కలను కాపాడవలసిన బాధ్యత తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెద్దగుట్టకు వెళ్లిన దంపతులు, పిల్లలు అదృశ్యం

తూప్రాన్, మార్చి 5: పెద్దగుట్టకు ఇద్దరు పిల్లలతో కలిసి వెళ్లిన దంపతులు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో జరిగింది. తూప్రాన్ ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన బిజిలిపురం యాదగిరి(37) చిట్టీల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 4న సోమవారం భార్య జ్యోతి (27), కూతురు మోక్ష (8), ధృవ(3)లు నిజామాబాద్ జిల్లాలోని పెద్దగుట్టకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి సోమవారం ఉదయం వెళ్లారు. వెళ్లినప్పటి నుంచి మొబైల్ ఫోన్ స్విచాఫ్ వస్తుండటంతో కుటుంబీకులు పెద్దగుట్టకు వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. స్నేహితులు, బంధువుల వద్ద వెతికినప్పటికీ ఫలితం లేక మంగళవారం యాదగిరి తల్లి బిజిలిపురం సుశీల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.


అదృశ్యమైన కుటుంబం

తమ్ముడిని గొడ్డలితో నరికి చంపిన అన్న

● సిద్దిపేట జిల్లా వింజపల్లిలో ఘోరం


శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం

కోహెడ, మార్చి 5: చెట్లను తొలగిస్తున్న సమయంలో అన్నదమ్ముల మధ్య ఏర్పడిన ఘర్షణ తమ్ముడి హత్యకు దారితీసింది. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వింజపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్ముల తిరుపతిరెడ్డి, కొమ్ముల శ్రీనివాస్‌రెడ్డి(32) అన్నదమ్ములు. ఒక్కొక్కరికి ఆరు ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నది. వ్యవసాయ బావి వద్ద ఇద్దరి మధ్యలో గట్టుపై చెట్లు ఉండడంతో అన్న తిరుపతిరెడ్డి మంగళవారం కూలీలను పెట్టి వాటిని తొలగిస్తున్నాడు. ఒక చెట్టుకు విద్యుత్ స్టార్టర్ డబ్బా ఉండగా.. దానిని కూడా తొలగించడంతో శ్రీనివాస్‌రెడ్డి పొలానికి మంగళవారం నీరు పారలేదు. చెట్టుకు ఉన్న స్టార్టర్ డబ్బాను ఎవరు తొలగించారని దుర్భాషలాడుతూ కూలీలపై తమ్ముడు శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో వారు మీ అన్న తిరుపతిరెడ్డి చెట్లు నరికేయాలని చెబితేనే తొలగిస్తున్నామని, తమను తిట్టొద్దని గొడవపడ్డారు. ఈ క్రమంలో అన్నదమ్ముల మధ్య మాటలు పెరిగి గొడవ తీవ్రమైంది. అన్న తిరుపతిరెడ్డి ఆవేశంతో శ్రీనివాస్‌రెడ్డి మెడపై దాడిచేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం కూలీలు, తిరుపతిరెడ్డి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సమాచారమందుకున్న ఏసీపీ సతీష్, సీఐ కిరణ్, ఎస్ఐ సీహెచ్ తిరుపతి, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య నాగశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. మృతుడికి కుమారుడు(4), కూతురు(1)ఉన్నారు.

ప్రతిపాదనలు సరే.. నిధులేవీ?

● 8న ఏడుపాయల జాతర ప్రారంభం
● రూ.2 కోట్లతో పనులకు ప్రతిపాదనలు


ఏడుపాయల అమ్మవారి ఆలయ ముఖచిత్రం


ఘనపురం ఆనకట్ట దిగువన ఉన్న పాయల్లో విస్తరించిన గుర్రపుడెక్క

పాపన్నపేట, మార్చి 5: ఈ నెల 8 నుంచి ఏడుపాయల వనదుర్గామాత జాతర ప్రారంభంకానున్నది. ఏటా మహాశివరాత్రి సందర్భంగా మూడురోజుల పాటు జాతర జరుగుతుంది. జాతరకు రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. ఈసారి సుమారు 10 లక్షలపైనే భక్తులు హాజరవుతారన్న అంచనాతో జాతర పనుల కోసం రూ.12 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. అయినా నేటికీ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. దీంతో ఆలయ ప్రాంతంలో చేపట్టాల్సిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతంలో ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాని రోజుల్లో జాతరయ్యే ఖర్చును దేవాదాయ శాఖనే భరించేది. తెలంగాణ ఏర్పడక ముందు జాతర నిర్వహణ ఖర్చు రూ.40 లక్షలు దాటేది కాదు. ప్రతీయేటా జాతరకు నెల లేదా 15 రోజులకు ముందే నిధులు విడుదలయ్యేవి. కానీ ప్రస్తుతం జాతరకు సమయం రెండు రోజులే ఉన్నా.. నేటికీ నిధులు విడుదల కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఇప్పటికీ మొదలు కాని పనులు

జాతరకు ముందు రోడ్ల మరమ్మతులు, సాగునీటి సౌకర్యం, విద్యుత్, స్నానఘట్టాలు, పారిశుధ్యం వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. జాతర నిర్వహణకు అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నా.. పనులపై దృష్టిసారించడం లేదు. ఇటీవల కలెక్టరేట్‌లో జాతర ఏర్పాట్లపై జరిగిన సమీక్షా సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారే తప్ప నిధులకు సంబంధించిన ఊసెత్తలేదు. ఇప్పటివరకు ఆలయం ఎదుట చలువ పందిళ్లను ఏర్పాటు చేయడమే మొదలు కాలేదు. భక్తులు స్నానాలు చేసే స్థలాల్లో, స్త్రీలు దుస్తులు మార్చుకోవడానికి చిన్నపాటి తాత్కాలిక గదులను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు జాతర ప్రాంతమంతా లోయలు, గుట్టలు, కొండలతో నిండి ఉన్నందున విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉండగా.. కేవలం ప్రధాన కూడళ్ల వద్దనే ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే అమ్మవారి ఆలయం ఉన్న ఘనపురం ఆనకట్ట పాయ పొడవునా గుర్రపు డెక్క మొలిచింది. దీంతో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నది. దానిని వెంటనే తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా ఆలయాధికారులు, పాలకవర్గం స్పందించి యుద్ధ ప్రాతిపదికన జాతరకు ముందే పనులు పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.



దుస్తులు మార్చుకోవడానికి ఏర్పాటు చేసిన గదులు

నేడు తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌పై 'అవిశ్వాసం'

● ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో జయచంద్రారెడ్డి


తూప్రాన్‌లో మున్సిపల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో

తూప్రాన్, మార్చి 5: తూప్రాన్ పట్టణ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసులు జారీ చేయడంతో బుధవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నారు. అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తుండటంతో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ ఖాజామెహియుద్దీన్, సీఐ కృష్ణ, సీఐ శివానందంతో కలిసి సమావేశం నిర్వహించేహాల్, సభ్యుల హాజరు, పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల తీరును పరిశీలించారు. సమావేశ మందిరంలో మరో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఎక్స్ అఫిషియో సభ్యుడిగా రఘోత్తంరెడ్డి

తూప్రాన్ మున్సిపల్‌లో 16 వార్డులుండగా చైర్మన్, వైస్ చైర్మన్, 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. కొత్తగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకు 16 మందికి ఓటింగ్ అవకాశం ఉండగా, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి నమోదుతో 17 మందికి చేరుకుంది.

మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం

తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నోటీసు మేరకు బుధవారం అవిశ్వాసంపై సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. అవిశ్వాస తీర్మాన సమావేశం ఏర్పాటుకు మూడింట రెండొంతుల మెజారిటీ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. హాజరైన సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది మద్దతు ఉన్న వైపు నెగ్గుతుందని ఆర్డీవో వివరించారు. కోరం సభ్యుల కోసం ఉదయం 11.30 గంటల వరకు వేచి చూస్తామని, హాజరు కాకుంటే వాయిదా వేసి మధ్యాహ్నం సమావేశం ఏర్పాటుకు నోటీసు ఇస్తామని చెప్పారు. మధ్యాహ్నం కూడా అరగంట పాటు వేచి చూస్తామని, ఒకవేళ కోరం సభ్యులు హాజరు కాకుంటే వీగిపోయినట్లేనని తెలిపారు. సమావేశంలో ఎలాంటి చర్చ ఉండదని, కేవలంలో చేతులు ఎత్తే పద్ధతిలో ఓటింగ్ జరుగుతుందని ఆర్డీవో పేర్కొన్నారు. అనంతరం వారి సంతకాలు తీసుకొని వివరాలను ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తామన్నారు.

కొండపాక ఎంపీపీపై..


ఆర్డీవోకు తీర్మానం కాపీని అందజేస్తున్న ఎంపీటీసీలు

కొండపాక, మార్చి 5: కొండపాక ఎంపీపీ రాగల సుగుణ దుర్గయ్యపై ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం 9మంది ఎంపీటీసీల సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మానం కాపీని గజ్వేల్ ఆర్డీవోకు అందజేశారు. మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎన్నికల్లో బీఆర్ఎస్ 8, కాంగ్రెస్ 3స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు మూడు స్థానాల్లో గెలిచారు. అనంతరం స్వతంత్రులంతా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అప్పుడు బందారం ఎంపీటీసీ ర్యాగల సుగుణను ఎంపీపీగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం మారడంతో ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కొంతకాలం నుంచి ప్రయత్నాలు సాగాయి. 14 మంది ఎంపీటీసీల్లో కుకునూరుపల్లి ఎంపీటీసీ సభ్యురాలు మృతి చెందడంతో 13 మంది మిగిలారు. అందులో కాంగ్రెస్ పార్టీకి చెందినవారితో కలిసి మొత్తం 9మంది ఎంపీటీసీలు ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటించి ఆర్డీవోకు తీర్మానాన్ని అందజేశారు.

గ్రూప్స్ పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

● నేటితో దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు.. 10న ప్రవేశ పరీక్ష

సిద్దిపేట క్రైం, మార్చి 5 : గ్రూప్ 1, 2, 3, 4, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ ఎస్ఐ కానిస్టేబుల్ తదితర రాష్ట్రస్థాయి, కేంద్రస్థాయి ఉద్యోగాల కోసం టీఎస్ఎస్ స్టడీ సర్కిల్లో ఫౌండేషన్ కోర్సు ద్వారా మూడు నెలల పాటు ఉచిత శిక్షణను అందజేస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సీహెచ్ కవిత, స్టడీ సర్కిల్ ఉమ్మడి మెదక్ జిల్లా సంచాలకుడు డాక్టర్ బండి శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మార్చి 7 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 10న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల మెరిట్ ఆధారంగా 100 మందికి సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. మార్చి 18నుంచి ఐదు నెలల పాటు తరగతులు జరుగుతాయని తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు తమ కుల, ఆదాయం, పదో తరగతి, డిగ్రీ, ఆధార్ కార్డు, పాస్ పోర్టు సైజు ఫొటోలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భూతగాదాలో గాయపడిన వ్యక్తి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


లక్ష్మయ్య (ఫైల్)

పాపన్నపేట, మార్చి 5: భూమి, ఆస్తి తగాదాల్లో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని కుర్తివాడలో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కుర్తివాడ గ్రామానికి చెందిన మెట్టు రాములు, యశోద దంపతులకు ఇద్దరు కొడుకులు లక్ష్మయ్య(36), యాదగిరి, ఒక కూతురు విజయలక్ష్మి ఉన్నారు. వారికి కొన్నేళ్లుగా తమ పొరుగున ఉండే దాయాదులు, బంధువులతో ఆస్తి, భూమి పంపకం విషయాల్లో గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు సైతం జరిగాయి. ఈ క్రమంలో రాములు పెద్ద కుమారుడు లక్ష్మయ్యపై వారు పగ పెంచుకున్నారు. సోమవారం రాత్రి ఇంటి వద్ద ఉన్న లక్ష్మయ్యపై పొరుగున ఉన్న దాయాదులు మెట్టు సావిత్రి, మెట్టు కిష్టమ్మ, మెట్టు మోహన్, అల్లాదుర్గం దత్తుతో పాటు మరికొందరు కలిసి లక్ష్మయ్యపై బండలు, కర్రలతో దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్య అపస్మారక స్థితిలోకి పడి ఉన్నాడు. దీంతో లక్ష్మయ్య కుటుంబీకులు ప్రాణభయంతో అక్కడి నుంచి పారిపోయారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని లక్ష్మయ్యను 108 వాహనంలో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం లక్ష్మయ్య మృతి చెందాడు. దాడి ఘటనలో ఇతర గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉన్నట్టు గ్రామస్థులు చెబుతున్నారు. ఘటనకు సంబంధించి ఐదుగురు అనుమానితులను పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం


మహేష్(ఫైల్)

చేగుంట, మార్చి 5: అప్పుల బాధతో ఒక యువకుడు ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. ఈ సంఘటన నార్సింగ్ మండలం వల్లూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. నార్సింగ్ ఎస్ఐ అహ్మద్ మొయినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం నర్సింగ్ మండలం వల్లూరు గ్రామానికి చెందిన అనందాస్ మహేష్(33) ఆర్థిక ఇబ్బందులతో అప్పులపాలై బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహేష్ తిరిగి రాలేదు. గ్రామ శివారులోని మాలగుట్ట ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట హాస్పిటల్‌కు తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు .

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి


నర్సింహులు మృతదేహం

చిన్నశంకరంపేట, మార్చి 5: మండలంలోని గవ్వపల్లి ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం ఓ వ్యక్తి పురుగుల మందు తాగి మృతి చెందాడు. కుటుంబీకులు, ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నాయిపల్లి గ్రామానికి చెందిన సాయన్నోల నర్సింహులు (50) మద్యానికి బానిసయ్యాడు. సోమవారం అతడు గవ్వలపల్లి సంతకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. గవ్వలపల్లి ఎక్స్ రోడ్డు సమీపంలోని పాత వైన్స్ షాపు వెనుకాల మద్యం మత్తులో పురుగుల మందు తాగి మృతి చెందాడు. మంగళవారం సంగాయిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మృతుడి బంధువులకు సమాచారం అందించాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోవలెంట్ పరిశ్రమలో ప్రమాదం.. నలుగురికి తీవ్ర గాయాలు

హత్నూర, మార్చి 5: మండల పరిధిలోని గుండ్ల మాచునూరులోని కోవలెంట్ లాబరేటరీస్ పరిశ్రమలో ప్రమాదం జరిగి నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తోటి కార్మికుల ద్వారా తెలిసింది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నలుగురు కార్మికులు పరిశ్రమల్లోని పీబీ-4 బ్లాక్‌లో విధులు నిర్వహిస్తుండగా.. ఒక్కసారిగా అగ్ని ప్రమాదం సంభవించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సాదిన్, ఫాదర్ మరండి, లాబ్ బబునుడితో పాటు మరొకరికి తీవ్ర గాయాలైనట్లు తోటి కార్మికులు తెలిపారు. వారందరినీ చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గ్యారంటీ పథకాల దరఖాస్తుల సేకరణ

● విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ


వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, అధికారులు

మెదక్ అర్బన్, మార్చి 5: ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న గారంటీ పథకాల దరఖాస్తులను సేకరించాలని విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్‌వేర్ వివరాల నమోదుపై ఆయా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ లబ్దిదారుడికి గ్యారంటీ పథకాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతీ మండలంలోని ఎంపీడీవో, మున్సిపాలిటీల్లో అవసరమైన మేర సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం 200 యూనిట్లులోపు వరకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లోని తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట వార్డుల్లో 10, మండలాల్లో 20 ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజల నుంచి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలను తీసుకొని సేవా కేంద్రాల ద్వారా తమ అర్హతను పరిశీలించుకొని అర్హులైన వారు వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

చెరకు రైతులకు పెండింగ్ బిల్లులన్నీ చెల్లించాం

● ట్రైడెంట్ చక్కెరకర్మాగారం డైరెక్టర్ ఖిజార్ యాపై



జహీరాబాద్, మార్చి 5: మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో గల ట్రైడెంట్ చక్కెర కర్మాగారం పరిధిలోగల చెరకు రైతులకు ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న చెరకు బకాయలు రూ.16.83 కోట్లు చెల్లించామని, కేవలం రవాణా, కోతకు సబంధించి రూ.68.18లక్షలు మాత్రమే ఇవ్వాల్సి ఉందని ట్రైడెంట్ చక్కెరకర్మాగారం డైరెక్టర్ ఖిజార్ యాపై తెలిపారు. మంగళవారం అయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ట్రైడెంట్ యాజమాన్యం చెరకు రైతులకు బిల్లులను చెల్లించడంలో నిర్లక్ష్యం చేయడంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. యాజమాన్యంలో ఏర్పడిన అంతర్గతంగ విభేదాల కారణంగా బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగిందన్నారు. తాను కర్మాగారం డైరెక్టర్‌గా ఆగస్టులో-2023లో బాధ్యతలను చేపట్టిన నాటికి రూ.16.83 కోట్ల పైచిలుకు చెరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అయితే ఇప్పటివరకు రూ.16.81కోట్లను రైతుల ఖాతాల్లో వేశామన్నారు. మరో 9మంది రైతులకుగాను రూ.1.83లక్షలు ఇవ్వాల్సి ఉందని వారి బ్యాంకుఖాతాలు సక్రమంగా లేని కారణంగా వేయలేకపోయామని, కర్మాగారానికి వచ్చి కర్మాగారం అధికారుల వద్ద 9మంది రైతులు డబ్బులను తీసుకోవాలని సూచించారు. అయితే రైతులకు ఇంకా రవాణా, కోతకు సంబంధించి రూ.68.18 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో చెల్లిస్తామన్నారు. తాను డైరెక్టర్‌గా నియామకం అయ్యాకే చెరకు రైతులకు పెండింగ్ బిల్లులన్ని చెల్లించి న్యాయం చేశానని ఆయన గుర్తుచేశారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి: సీపీ



చిన్నకోడూరు: ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న సీపీ డాక్టర్ బి. అనురాధ

సిద్దిపేట క్రైం, మార్చి 5: ప్రతీ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ రిసెప్షన్ వర్టికల్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆమె కమిషనర్ కార్యాలయంలో రిసెప్షన్ వర్టికల్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ వర్టికల్ సిబ్బంది బాగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఫిర్యాదుదారులు నేరుగా రిసెప్షనిస్టు దగ్గరికి వస్తారని మీరు ప్రవర్తించే తీరు చాలా ముఖ్యమని తెలిపారు. ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తును స్వీకరించేటప్పుడు పూర్తి వివరాలు ఖచ్చితంగా ఉండేటట్లు చూడవలసిన బాధ్యత రిసెప్షనిస్టుదేనని తెలిపారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి భరోసా కల్పించాలని, వీలైనంత తొందరగా న్యాయం చేయాలని సూచించారు. పోలీసు ఉద్యోగం అంటే అధికారం అని కాకుండా బాధ్యత అని తెలుసుకుని డ్యూటీ చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే పేదవారికి, మహిళలకు, వృద్ధులకు వారి సమస్యలు మానవీయ కోణంలో విని వెంబడే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి, ఐటీసెల్ ఎస్ఐ నరేందర్ రెడ్డి, ఐటీకోర్ సిబ్బంది రాజిరెడ్డి, హరికృష్ణ స్వామి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలి

చిన్నకోడూరు, మార్చి 5: విద్యార్థినులు ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఎన్ని కష్టాలు ఎదురైనా ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకెళ్లాలని సీపీ డాక్టర్ బి. అనురాధ సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దకోడూరు గ్రామ శివారులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉమెన్స్ డే సందర్భంగా యూనియన్ బ్యాంక్ (రీజినల్ ఆఫీస్ సిద్దిపేట)వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సాధికారిత కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారికతకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ఆకర్షణ ద్వారా యుక్త వయస్సులో ప్రేమలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే పట్టుదలతో పాటు, కఠోర సాధన అవసరమన్నారు. విద్యార్థినులకు సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో కళాశాలకు ఎల్‌ఈడీ టీవీని సీపీ చేతుల మీదుగా బహుకరించారు.

కార్యక్రమంలో వికాస్ రాజ్ యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ వీర రాఘవ, డిప్యూటీ రీజనల్ హెడ్ సంజయ్ కుమార్ చౌదరి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాసాయిపేట, మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లిస్తున్నట్లుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పారిశుధ్య కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం మాసాయిపేటలో పలువురు కార్యకర్తలు టీఎస్ ఎమ్మార్పీఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... అరకొర జీతాలతో రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందువల్ల ప్రతి నెలా ఒకటవ తేదీన జీతాలు అందించాలని కోరారు. అలాగే ప్రభుత్వం తరఫున వారికి అన్నీ సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గుడి కృష్ణ, హరిప్రసాద్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు రూ.36 కోట్లు మంజూరు

మెదక్ అర్బన్, మార్చి 4: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.36 కోట్లు సీసీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందని అదనపు కలెక్టర్ రమేష్ తెలిపారు. మంగళవారం మెదక్‌లో పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికలకోడ్ రానున్నందున పనులు వేగవంతం చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, 20రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నర్సింహులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేష్

ఉపాధి హామీ పనులను పూర్తి చేయాలి

- నారాయణఖేడ్ మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మార్చి 5: ఉపాధి హామీ పథకం కింద వచ్చిన నిధులతో సీసీ రోడ్లు, మన ఊరు-మన బడి పనులను వెంటనే పూర్తి చేయించాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం ఖేడ్ ఎంపీపీ చాందిబాయిచౌహాన్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అడ్వాన్స్‌గా బిల్లులు పొందిన మాజీ సర్పంచులతోనే పనులు పూర్తి చేయించాలని సూచించారు. లేదంటే కార్యదర్శుల వేతనాల నుంచి రికవరీ చేస్తామని చెప్పారు. ధరణి పోర్టల్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలను గ్రామాలకు వస్తున్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామాల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సాయిరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, డీటీ అనుదీప్ పాల్గొన్నారు. ఈ నెల 8న మహాశివరాత్రి పండుగ ఉన్నందున ఒకరోజు ముందుగా 7న ఖేడ్ పట్టణ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల వారు ఒకే చోట నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేయించామని తెలిపారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పాఠశాలలను బలోపేతం చేయాలి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల డ్రాపౌట్ లేకుండా చూడాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లను ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. మంగళవారం నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలనతో విధులు నిర్వహించాలని కోరారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయాన్ని తీసుకువచ్చేందుకు కూడా ప్రయత్నాలు చేస్తామని చెప్పారు. పాఠశాలల్లో లైబ్రేరీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంఈవోలు విశ్వనాథ్, శంకర్, శ్రీనివాస్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకుడు రమేష్ పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలోనే పటిష్టమైన విద్యనందించాలి

- సంగారెడ్డి విద్యాధికారి వెంకటేశ్వర్లు



పోచాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 5: ప్రాథమిక స్థాయిలోనే పటిష్టమైన విద్యనందిస్తే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతంగా ఎదుగుతారని సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. సిర్గాపూర్ మండల పరిధిలోని పోచాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యాబోధన, విద్యార్థుల హాజరు తదితర విషయాలను తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షల పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలన్నారు. అనంతరం మన ఊరు-మన బడి పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు. ఆయనవెంట ఎంఈఓ శంకర్, పాఠశాల హెచ్‌ఎం గుండు లక్ష్మణ్, ఉపాధ్యాయులు గోవర్ధన్, రాజశేఖర్, మారుతి తదితరులు ఉన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



పోలీసుల అదుపులో సీపీఎం నాయకుడు మాణిక్యం

సంగారెడ్డి రూరల్, మార్చి 5: ప్రధాని పర్యటనను అడ్డుకుంటామన్న సీపీఎం నాయకులను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి, సంగారెడ్డి పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. సంగారెడ్డి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించినందుకు అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లాకు రైల్వే లైన్ మంజూరు చేయాలని, మెట్రో రైల్‌ను సంగారెడ్డి వరకు పొడిగించాలని, నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్ ప్రాంతాల్లో వలసలను నివారించాలని కోరడం నేరమా అని ప్రశ్నించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి తగిన బుద్ధి చెబుతామని వారు స్పష్టం చేశారు.

టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా జోగినాథ్



జోగిపేట, మార్చి 5: ఉమ్మడి మెదక్ జిల్లా టెలిఫోన్ కమిటీ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా గంగా జోగినాథ్‌గుప్తా నియామకమయ్యారు. అందోలు నియోజకవర్గం పెద్దాపూర్ గ్రామానికి చెందిన జోగినాథ్.. టీడీపీ హయాంలో జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. అనంతరం టీఆర్ఎస్‌లో చేరి ప్రస్తుతం అందులోనే కొనసాగుతున్నారు. గత డిసెంబరులో జోగినాథ్‌ను టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమించాలని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ సిఫారసు చేశారు. ఈ మేరకు టీఏసీ సభ్యుడుగా నియమిస్తూ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఎండీ ఊర్వశి సంగ్వార్ ఉత్తర్వులు జారీ చేశారు.

గుండెపోటుతో పీఏసీఎస్ చైర్మన్ మృతి

చేగుంట, మార్చి 5: నార్సింగి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శంకర్‌గౌడ్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. తన సోదరుడు రాజాగౌడ్‌కు హైదరాబాద్‌లో ఇటీవల గుండె ఆపరేషన్ కాగా పరామర్శించడానికి వెళ్తున్న క్రమంలో గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే శంకర్‌గౌడ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు శంకర్‌గౌడ్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

గ్రామాల్లో సీసీ రోడ్డుపనులు ప్రారంభం



దామర్‌గిద్దలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

నాగల్‌గిద్ద, మార్చి 5: మండల పరిధిలోని దామర్‌గిద్ద, గౌండెగాం గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ పండరినాథ్‌రావు, మాజీ సర్పంచు శాంతయ్యస్వామి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పల్లెలు, పట్టణాల అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెద్దగోపులారంలో



పెద్దగోపులారంలో పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ పాండు

మునిపల్లి: మండలంలోని పెద్దగోపులారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ పాండు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యంగానే పల్లె రోడ్లు అధ్వానంగా ఉండేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రాచయ్య, కిష్టయ్య, మాజీ ఉప సర్పంచ్ నర్సింలు, శ్రీశైలం, బాలయ్య, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, నాయకులు నరేందర్, బుడ్డ మల్లేశ్, నీలం శ్రీనివాస్, మహేందర్, అమరేశ్వర్ తదితదిరులు పాల్గొన్నారు.

కొప్పోల్ ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లు

పెద్దశంకరంపేట, మార్చి 5: కొప్పోల్ ఉమా సంగమేశ్వర్ స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 7నుంచి 10 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 7న పుణ్యాహవచనం, రుత్విక్ వరణము అగ్ని ప్రతిష్ఠాపన, దుర్గా భవానికి అభిషేకం, 8న మహాశివరాత్రి రుద్రాభిషేకం, రుద్ర హోమం, లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకం, 9న ఉమాసంగమేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, శకట బ్రహ్మోత్సవం, 10న పూర్ణాహుతి, రథోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు: డీఎం

నారాయణఖేడ్: మహాశివరాత్రి ఉత్సవాల కోసం వివిధ పుణ్య క్షేత్రాలకు ఈ నెల 7 నుంచి 10 వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏడుపాయల జాతరకు ఖేడ్, హైదరాబాద్‌లోని జూబ్లీ బస్టాండ్ నుంచి 17 చొప్పున, పొడ్చన్‌పల్లి నుంచి ఎనిమిది బస్సులను నడుపుతామన్నారు. పెద్ద శంకరంపేట నుంచి కొప్పోల్ జాతరకు ఐదు బస్సులను నడుపుతామని చెప్పారు. ఆయాపుణ్యక్షేత్రాలకు ప్రతి అరగంటకు ఒక బస్సు బయలుదేరుతుందని వెల్లడించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిలు ఉచితంగా ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

కలెక్టరేట్‌లో క్రీడా పోటీలు

సంగారెడ్డి రూరల్, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రీడా, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. జిల్లా సంక్షేమాధికారి లలిత కుమారి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా, మండల, గ్రామ స్థాయిలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌లో వివిధ శాఖల మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లెక్చరర్ సుప్రియకు డాక్టరేట్

జోగిపేట, మార్చి 5: జోగిపేట నెహ్రూ స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సుప్రియ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ పట్టాను పొందారు. ఎఫెక్ట్ ఆఫ్ యోగా ప్రాక్టీసెస్ ఆన్ ఫిజికల్, ఫిజికలాజికల్ అండ్ సైకలాజికల్ వేరియబుల్స్ అమౌంట్ ఇన్ సెంట్రల్ తెలంగాణ గర్ల్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా లభించింది.

ఎంపీ అభ్యర్థిగా మద్దతివ్వండి

సంగారెడ్డి రూరల్, మార్చి 5: గత 30 ఏళ్లుగా అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేసిన తనకు మెదక్ ఎంపీ అభ్యర్థిగా మద్దతివ్వాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకుడు బీరయ్య యాదవ్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో అసదుద్దీన్‌ను పార్టీ కార్యాలయంలో కలిసి కోరారు. ఓవైసీ సానుకూలంగా స్పందించి మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయనవెంట బీఆర్ఎస్ మైనార్టీ శాఖ రాష్ట్ర నాయకుడు ఉస్మాన్ అలీ ఉన్నారు.

పీఎంజేజేబీవై చెక్కు అందజేత

మునిపల్లి, మార్చి 5: మండల పరిధిలోని మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల నారాయణ(51) జనవరి 3న మృతి చెందాడు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన పథకంలో భాగంగా మృతుడికి బుదేరా ఎస్‌బీఐ బ్రాంచీలో ఖాతా ఉన్నందున నామినిగా ఉన్న అతడి భార్య జర్ణమ్మకు రూ.2లక్షల ఇన్సూరెన్సు మంజూరైంది. ఆ చెక్కును బ్యాంక్ మేనేజర్ సురేష్ మంగళవారం జర్ణమ్మకు అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

అల్లాదుర్గం, మార్చి 5: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, మరో 12 మందికి రూ.రెండు వేల జరిమానా విధిస్తూ ప్రత్యేక మొబైల్ కోర్టు మెదక్ న్యాయాధికారి మంగళవారం తీర్పును వెల్లడించినట్లు అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

బిలాల్‌పూర్ ఎస్సీ కాలనీలో తాగునీటి కటకట

కోహీర్, మార్చి 5: మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో గల ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. కాలనీలో ఉన్న బోరు బావి మోటారు చెడిపోయి నాలుగు రోజులు గడుస్తున్నా అధికారులు బాగు చేయకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. బోరును బాగు చేయాలని కాలనీవాసులు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. దీంతో ఎస్సీ కాలానికి చెందిన మహిళలు బిందెలు తీసుకొని ఇతర కాలనీలోకి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు.

నేడు పుల్కల్ మండల సర్వసభ్య సమావేశం

పుల్‌కల్, మార్చి 5: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆనందమేరి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షురాలు పట్లోళ్ల చైతన్యవిజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు స్థానిక సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జిల్లా పరిషతు చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచులు, ప్రభుత్వ అధికారులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో ఆనందమేరి కోరారు.

వాహనాల సీజ్

తూప్రాన్, మార్చి 5: తూప్రాన్ సబ్ డివిజన్ పరిధిలో నంబర్లు ప్లేట్లు లేకుండా వినియోగిస్తున్న 110 వాహనాలను సీజ్ చేసినట్లు తూప్రాన్ డీఎస్పీ సామ వెంకటరెడ్డి తెలిపారు. పట్టుబడిన వాహనదారులకు, వాహనాలను అమ్మిన యజమానులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

'పోడు భూములకు పట్టాలివ్వాలి'

మాసాయిపేట, మార్చి 5: మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయపల్లి గ్రామంలోని పోడు భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేసి, రైతు భరోసా కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. రైతు సంఘం నాయకులు ఐలయ్య, మైసయ్య, పద్మ, నరసమ్మ, రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం మాసాయిపేట తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఏళ్లుగా పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలివ్వాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, మార్చి 5: మెదక్ జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు ఇంటర్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణిత, వృక్ష, పౌరశాస్త్ర పరీక్షలు జరిగాయి. జనరల్ విభాగంలో 5,468 మంది, ఒకేషనల్ విభాగంలో 414 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో 17,282 మందికి 16,835 మంది హాజరుకాగా, 447 మంది గైర్హాజరయ్యారు. 97.41 హాజరు శాతం నమోదైంది. సంగారెడ్డిలోని మూడు పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్, డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు.

వంతెన లేక రోడ్డు ప్రమాదాలు

- నిర్మించాలని రామంతాపూర్‌వాసుల డిమాండ్

మాసాయిపేట, మార్చి 5: మాసాయిపేట మండలం రామంతాపూర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై వంతెన లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. చౌరస్తా వద్ద సిగ్నల్స్ కూడా లేకపోవడం, ఉన్నవి కూడా సరిగ్గా పని చేయపోవడంతో పాదచారులు రోడ్డు దాటాలంటే జంకుతున్నారు. రామంతాపూర్ చౌరస్తా వద్ద రోడ్డు ఎత్తు, ఒంపులతో అతిగా మలుపు తిరిగి ఉండడంతో అతివేగంగా వచ్చిన వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో సుమారు 30 మందికి పైగా మృత్యువాత పడ్డారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతిలక్ష్మి

కొండాపూర్, మార్చి 5: ఎంపీడీవో జ్యోతిలక్ష్మి మంగళవారం మారేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అమె కూలీలతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనిలో కూలీ రూ.272 ఎలా పొందాలో వివరించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కల్లో కలుపు నివారణ చేపట్టాలని ఎఫ్‌ఏను ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు.

నేటి నుంచి ఈ-బాజా ఈవెంట్

నర్సాపూర్, మార్చి 5: మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ నెల 6నుంచి ఈ-బాజా ఈవెంట్ ప్రారంభం కానుంది. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 70 జట్లు పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌తో పాటు రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ సంస్థ ప్రతినిధి హిరోటెక్‌హరడా, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణు రాజు తదితరులు హాజరు కానున్నారు. 6నుంచి 11వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నారు.

సేవా కేంద్రంలో దరఖాస్తుల స్వీకరణ

నిజాంపేట, మార్చి 5: గృహజ్యోతి పథకం అమలులో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజిరెడ్డి సూచించారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులు ఎవరైనా ఇప్పటి వరకు గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోకుంటే సేవాకేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు మంగళవారం విద్యుత్ వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, మాట్లాడారు. వినియోగదారులు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంటు బిల్లుతో ప్రజా పాలన సేవాకేంద్రంలో దరఖాస్తు రసీదు జతచేసి ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో రాజేందర్, జూనియర్ అసిస్టెంట్ విఠల్ తదితరులు ఉన్నారు.

ఘనపురం ఆయకట్టుకు సింగూరు జలాలు

పుల్‌కల్, మార్చి 5: ఘనపురం ఆయకట్టు పరిరక్షణకు సింగూరు జలాలను మంగళవారం నీటి పారుదల శాఖ అధికారులు విడుదల చేశారు. ప్రాజెక్టుకు ఎడమ వైపున నిర్మించిన జల విద్యుత్ కేంద్రంలోని 7.5మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ఉత్పత్తి గేట్ ద్వారా 1,460 క్యూసెక్కుల నీటిని దిగువన గల మంజీర జలాశయంలోకి వదులుతున్నారు. మంజీర జలాశయానికి జలాలు చేరుకున్న అనంతరం బుధ లేదా గురువారం ఘనపురం ఆనకట్టకు విడుదల చేయనున్నారు. 0.4 టీఎంసీల జలాలను విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. వరి కోతల వరకు నీటి విడుదల కొనసాగుతూనే ఉంటుందన్నారు.



సంగారెడ్డిలో డీఆర్వోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లవాగు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలి

నారాయణఖేడ్/కల్హేర్, మార్చి 5: సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు నుంచి యాసంగి పంటలకు నీటిని విడుదల చేయాలని కోరుతూ నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి సంగారెడ్డిలో డీఆర్వోకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. యాసంగిలో కుడి కాలువ ద్వారా ఒక దఫా నీటిని విడుదల చేయడంతో కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట, క్రిష్ణాపూర్, ఖానాపూర్(కె), కల్హేర్, ఫత్తేపూర్ గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు జొన్న పంట వేశారని చెప్పారు. ఇప్పుడు నీరు అందకపోవడంతో పంట ఎండిపోయే ప్రమాదం ఉన్నదన్నారు. నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచు అధ్యక్షుడు రవిందర్ రెడ్డి, కిషన్‌రెడ్డి, అరవింద్‌రావ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి

- పీఆర్సీ చైర్మన్‌కు పీఆర్టీయూ వినతి

కౌడిపల్లి, మార్చి 5: ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీని అమలు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌ను కలసి విన్నవించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఓం ప్రకాశ్ మాట్లాడుతూ.. ఎస్‌జీటీలకు వేతనంలో ఉన్న వ్యత్యాసాలను తగ్గించాలని, ఉద్యోగి అయిన తల్లి, తండ్రి మరణించిన సమయంలో ఒకరికి కారుణ్య నియామకం ఇచ్చేవరకు కనీస వేతనంతో కూడిన జీతం చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ సెలవులు 90 నుంచి 180 రోజులకు పెంచాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో పీఆర్టీయూ వ్యవస్థాపకుడు హర్షవర్ధన్‌రెడ్డి, అనంతరెడ్డి, బాలజీ, శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.



పీఆర్సీ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలి

వెల్దుర్తి: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసే ప్రభుత్వ ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించాలని ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం కోరారు. ఈ మేరకు రాష్ట్ర వేతన సవరణ కమిషన్ చైర్మన్ శివశంకర్‌ను హైదరాబాద్‌లో ఎస్‌జీటీయూ రాష్ట్ర అధ్యక్షుడితో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని, పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా పీఆర్సీ ఫిట్‌మెంట్ 43శాతానికి తగ్గకుండా ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు రిటైర్మెంట్ గ్రాట్యుటీ రూ.16 లక్షల నుంచి రూ.28లక్షలకు పెంచాలని కోరారు. ఉపాధ్యాయులకు సంవత్సరానికి ఇస్తున్న సంపాదిత సెలువులు 6 రోజుల నుంచి 12రోజులకు పెంచాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్

జిన్నారం, మార్చి 5: జిన్నారం మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనుల నిర్వహణ, సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్ సూచించారు. మంగళవారం జిన్నారంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అనంతరం జడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ మాట్లాడుతూ.. ఆయా సమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో అరుణ, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీటీసీలు గంగు రమేష్, భార్గవ, కో ఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్, పీసీబీ ఏఈ అజయ్ పాల్గొన్నారు.

రూ.4లక్షల ఆర్థిక సహాయం అందజేత

జహీరాబాద్, మార్చి 5: మండలంలోని దిడిగి గ్రామానికి చెందిన సొన్నాయిల ప్రశాంత్‌కుమార్, ఆయన భార్య లినోరా, ఇద్దరు పిల్లలు హెప్సీబా గ్రేస్, తేజస్విని ఇటీవల రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. విషయం తెలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గాలి అనిల్‌కుమార్ మంగళవారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి, క్షతగాత్రులను పరామర్శించారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.4లక్షల సహాయాన్ని అందజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రేగోడు, మార్చి 5: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం రేగోడు తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాలలక్ష్మి, జడ్పీటీసీ యాదగిరి, రాయికోడ్ టీపీసీసీ మెంబర్ మున్నూరు కిషన్, చోటుమియా, శ్రీనివాస్‌రెడ్డి, సంగారెడ్డి, శంకరప్ప, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

చేగుంట, మార్చి 5: మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు సోమవారం రాత్రి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిలో చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ రజక ప్రవీణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ మ్యాకల పరమేష్, డైరెక్టర్లు గాండ్ల రమేష్, స్వర్గం సిద్ధిరాములు, ఎరుకల రాములు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ సాకలి రమేష్, పూలబోయిన వెంకటి, పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షుడు సిరిసిల్ల ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు బుడ్డ భాగ్యరాజు, పుట్ట మహేష్, దాసోజీ కృష్ణ, బచ్చుల కృష్ణ, స్వామి శేరిపల్లి, గడ్డమీది సిద్ధిరాములు ఉన్నారు.

మెదక్‌లో బోనాల పండుగ



వివిధ వేషధారణలతో కళాకారుల విన్యాసాలు

మెదక్ అర్బన్, మార్చి 5: మెదక్‌లో రేణుకా ఎల్లమ్మ ఆలయ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. వేడుకల్లో చివరి రోజు అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. ఉత్సవాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డమీది కృష్ణాగౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేందర్‌గౌడ్, గౌడ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న స్వామి జాతరలో రాజిరెడ్డి



ప్రత్యేక పూజలు చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తి: శేరి గ్రామంలో జరుగుతున్న మల్లన్న స్వామి జాతరకు మంగళవారం సాయంత్రం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి హాజరూ, మల్లన్న స్వామి, ఎల్లమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయనవెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, పోతిరెడ్డి, మహేష్ తదితరులు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం

హత్నూర: కొన్యాల గ్రామంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు ఏకాదశ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.

రసాభాసగా రామాయంపేట బడ్జెట్ సమావేశం

- ఎమ్మెల్యే రోహిత్ ఎదుటే మున్సిపల్ చైర్మన్‌పై కాంగ్రెస్ కౌన్సిలర్ల మాటల యుద్ధం
- నాలుగేళ్లుగా ఏం పీకావంటూ ఆగ్రహం
- మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డిపైనా విమర్శలు

రామాయంపేట, మార్చి 5: రామాయంపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. బీఆర్ఎస్ చైర్మన్‌పై కాంగ్రెస్ కౌన్సిలర్లు మాటల దాడికి దిగారు. "చైర్మన్ ఓ దద్దమ్మ, అభివృద్ధి తిరోగమనానికి ఆయనే అడ్డు" అని 11వ వార్డు కౌన్సిలర్(కాంగ్రెస్) అనడంతో చైర్మన్‌తో పాటు బీఆర్ఎస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. అయినప్పటికీ ఉన్న నలుగురు కాంగ్రెస్ కౌన్సిలర్ల దూషణలు బీఆర్ఎస్ సభ్యులను ఉక్కిరి బిక్కిరి చేశాయి. చైర్మన్‌పై త్వరలో అవిశ్వాసం పెడతామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఎదుటే హెచ్చరించారు. మరో కౌన్సిలర్ దేమె యాదగిరి మాట్లాడుతూ.. నాలుగేళ్లలో పట్టణం ఎలాంటి పురోభివృద్ధికి నోచుకోలేదు. ఇందుకు చైర్మన్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే ఎదుటే దూషించుకుంటున్న చైర్మన్, కౌన్సిలర్లు

కక్షసాధింపు దిశగా సమావేశం

రామాయంపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశం కౌన్సిలర్ల కక్ష సాధింపు దిశగా కొనసాగింది. ఇదివరకు బీఆర్ఎస్‌లో ఉన్న నలుగురు ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. అప్పటికే చైర్మన్, నలుగురు సభ్యుల మధ్య ఉన్న విభేదాలు బడ్జెట్ మీటింగ్‌లో బయటపడ్డాయి. మున్సిపల్ ఎన్నికలు జరిగి నాలుగేళ్లయినా చైర్మన్ జితేందర్ అభివృద్ధికి సహకరించలేదని ప్రత్యర్థి సభ్యులు సమావేశంలో వాదనకు దిగారు.